క్లుప్తంగా

ఆసుపత్రిలో భోజనాల పరిశీలన



ఆసుపత్రిలో భోజన వసతిని పరిశీలిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు అందిస్తున్న భోజనాలను టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ గురువారం పరిశీలించి, అసంతృప్తిని వ్యక్తం చేశారు. భోజనం రుచిగా లేదని రోగులు, వారి బంధువులు ఎమ్మెల్యే రోషన్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో తాను ఈ పరిశీలన చేశానని కృష్ణ చెప్పారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి తూటి కుంటరాము, కౌన్సిలర్ కరుటూరి రమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభాస్ ఫ్యాన్స్ సందడి



బుట్టాయగూడెంలో సందడి చేస్తున్న ప్రభాస్ ఫ్యాన్స్

బుట్టాయగూడెం: రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా రూపొందిన కల్కి 2898 ఏడీ చిత్రం రిలీజ్ సందర్భంగా గురువారం ప్రభాస్ ఫ్యాన్స్ సందడి చేశారు. స్థానిక థియేటర్ వద్ద ప్లెక్సీలు కట్టి తోరణాలతో అలంకరించారు. బాణసంచా కాల్చి హడావుడి చేశారు. తెల్లవారుజామున బెనిఫిట్ షో అనంతరం తీన్మార్ డప్పులతో నృత్యాలు చేస్తూ సినిమాహాల్ నుంచి మెయిన్ సెంటర్ వరకు ర్యాలీ చేశారు.

లాసెట్‌లో షీమా తరున్నమ్‌కు 9వ ర్యాంకు



షీమా తరున్నమ్

చింతలపూడి: ఏపీ పీజీ లాసెట్–2024 ప్రవేశ పరీక్షలో చింతలపూడికి చెందిన సయ్యద్ షీమా తరున్నమ్ రాష్ట్రస్థాయి 9వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా షీమా మాట్లాడుతూ రెండేళ్ల పీజీ కోర్సు కోసం ప్రభుత్వం నిర్వహించిన ప్రవేశం పరీక్షలో తనకు 87 మార్కులు వచ్చాయన్నారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు రాజ్యాంగ పరమైన హక్కులను అందేలా కృషి చేయటమే తన ఆశయమని పేర్కొన్నారు. షీమా చింతలపూడిలోని సిటీ పబ్లిక్ హైస్కూల్‌లో 10వ తరగతి వరకు, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్, భీమవరం డీఎన్నార్ లా కళాశాలలో ఐదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ చేశారు. ప్రస్తుతం ఆమె చింతలపూడి బార్ అసోసియేషన్‌లో సభ్యురాలిగా ఉన్నారు ఆమె తండ్రి సయ్యద్ జఫ్రుల్లా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు.

రేపు దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరం



దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

దెందులూరు: ప్రభుత్వం దివ్యాంగులకు అవసరమయ్యే ఉపకరణాలను అందించేందుకు నిర్ధారణ వైద్యశిబిరాలు నిర్వహిస్తోందని ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు మండల విద్యాశాఖాధికారులు ఏవీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ అన్నారు. గురువారం దెందులూరు ఎంఈఓ కార్యాలయంలో దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 29న దెందులూరు గారపాటి హైమావతిదేవి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వైద్యశిబిరం జరుగుతుందని ఎంఈఓలు తెలిపారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ టీచర్లు హేమలత, శ్రీదేవి, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది భవాని పాల్గొన్నారు.

ఢిల్లీ హైకోర్టు తీర్పు హర్షణీయం

దెందులూరు: ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు నిలిచిపోయిన టీవీ 9, ఎన్‌టీవీ, 10 టీవీ , సాక్షి టీవీ ప్రసారాలు పునరుద్ధరించడంపై వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తేరా ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను ఎవరైనా గౌరవించాల్సి ఉంటుందన్నారు. ప్రసార సాధనాలు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటాయని ఏమైనా సమస్యలుంటే సమస్యల దిశగా పయనించాలే తప్ప కక్షపూరితంగా నాలుగు ఛానళ్ల ప్రసారాలను నిలుపుదల చేయడం భవిష్యత్ తరాలకు ఏమి సంకేతాలు ఇస్తుందో? ప్రభుత్వం చెప్పాలన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జోగేశ్వరరావు



బయ్యన్నగూడెం ఎంపీపీ స్కూల్లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేసిన దృశ్యం

టి.నరసాపురం: ప్రభుత్వం కల్పిస్తోన్న సౌకర్యాలు వినియోగించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జయ్యవరపు శ్రీరామమూర్తి విద్యార్థులకు సూచించారు. మండలంలోని కేతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు బాల్యం నుంచే ప్రణాళికా బద్ధంగా విద్యను అభ్యసించాలని శ్రీరామమూర్తి సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు అడపా నాగరాజు, నాయుడు రామకృష్ణారావు గౌడ్, భీమవరపు జగన్ మోహన్‌రావు, వెలిది నాగబాబు, జయ్యవరపు శ్రీనివాసరావు, జయవరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరూ బడిలోనే ఉండాలి

టి.నరసాపురం: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంపీడీఓ కె.జోగేశ్వరరావు అన్నారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో గురువారం విద్యాప్రవేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాల వయస్సున్న పిల్లలందరూ పాఠశాలల్లో ఉండేటట్లు హెచ్‌ఎంలు ఆయా పాఠశాలల పరిధిలో సర్వే చేసి విద్యా ప్రవేశ్ 90 రోజుల కార్యక్రమం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు టి.రామ్మూర్తి, ఎస్ కళ్యాణి, మండల విస్తరణాధికారి రామ్ ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

కొయ్యలగూడెం: మండలంలోని బయ్యనగూడెం ఎంపీపీ స్కూల్లో విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం అన్నపూర్ణేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హాజరై మాట్లాడారు. మధ్యాహ్నం భోజనం అమలను పరిశీలించారు. తోట రవి, బాలం నరేష్, మద్దు తేజ, పాలి నాని, పారేపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందుబాటులో ఉండాలి

చింతలపూడి: ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు పనివేళల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి నియోజకవర్గ అంబేద్కర్ గురుకుల పాఠశాల, ఎస్సీ హాస్టళ్ల ప్రిన్సిపాల్, వార్డెన్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతులు, ఇతర సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే డైలీ మెనూ, శానిటేషన్, మంచినీటి సదుపాయాల్లో లోపాలుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం: వెలగపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లుకొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని జంగారెడ్డిగూడెం విద్యుత్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వివిధ ఫీడర్ల పరిధిలో..

చింతలపూడి: లింగపాలెం, చింతలపూడి, నాగిరెడ్డిగూడెం ఫీడర్ల పరిధిలో లైన్ నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. వెలగలపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, చింతలపూడి పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు బుట్టాయగూడెం మండల పరిషత్ సమావేశం

బుట్టాయగూడెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ జి.సుధాప్రవీణ్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

ఐటీడీఏ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో 25 శాఖలకు చెందిన అధికారులతో గురువారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సమీక్షించారు. అధికారులంతా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం సూర్యతేజ, ఏపీఓ వీవీఎస్ నాయుడు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

జంగారెడ్డిగూడెం: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. డిగ్రీ పూర్తిచేసిన పంగిడిగూడెం గ్రామానికి చెందిన యువతి ఇంటి వద్దే ఉంటోందన్నారు. ఈ నెల 26వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదని తండ్రి ఫిర్యాదు చేశాడని తెలిపారు. తమ కుమార్తె అదృశ్యంలో బుట్టాయగూడెం మండలం మర్లగూడెం గ్రామానికి చెందిన యువకుడు బండారు దిలీప్‌కుమార్‌పై అనుమానం ఉన్నట్టు పేర్కొన్నాడని చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని హెచ్‌సీ తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన సాయిన వెంకటలక్ష్మికి, లక్కవరానికి చెందిన పెద్దపూడి వెంకట్రాజుకు 2022లో వివాహమైందన్నారు. తన తల్లితండ్రులు వివాహ సమయంలో రూ.3 లక్షలు నగదు, 3 కాసుల బంగారం, సారె ఇచ్చినట్లు వెంకటలక్ష్మి తెలిపింది. మద్యం, జూదం అలవాటు ఉన్న వెంకట్రాజు అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, దీనికి అతని కుటుంబసభ్యులు సహకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్సై తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



వృద్ధులను పరీక్షిస్తున్న డాక్టర్ శిరీష

ఉంగుటూరు: ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వద్ద వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. డాక్టర్ కస్తూరి శిరీష వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు అందజేశారు. కీళ్ళ సమస్యలు, అజీర్ణం, నిద్రలేమి సమస్యలకు తగిన ఆయుర్వేద మందులు పంపిణీ చేసి సూచనలు, సలహాలు అందజేశారు. ఆసుపత్రి సహాయకురాలు కృష్ణకుమారి, సామాజిక కార్యకర్త తల్లాప్రగడ భీమేశ్వరరావులు సహకరించారు. శిబిరంలో 96 మంది ఆరోగ్య సేవలు పొందారు.

సీపీఎం మండల సమావేశం



వింజరంలో జరిగిన సీపీఎం మండల కార్యవర్గ సమావేశం

పోలవరం రూరల్: గిరిజనుల సాగులో ఉన్న భూములను సాగు అడంగళ్‌లో చేర్చాలని సీపీఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు అన్నారు. సీపీఎం పోలవరం మండల సమావేశం వింజరం గ్రామంలో గురువారం సముద్రాల సాయికృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామకృష్ణ మాట్లాడుతూ ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్టం ప్రకారం సాగులో ఉన్న భూములకు గిరిజనుల పేరుతో సాగు అడంగళ్‌లో ఎక్కించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని పోలవరం, బుట్టాయగూడెం , జీలుగుమిల్లి మండలాల్లో ఉన్న సాగు భూములన్నీ గిరిజనుల పేర్లతో అడంగళ్‌లో ఎక్కించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొవ్వాసు గంగ, డి.సుబ్బాయమ్మ, ఆకుల దుర్గ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలి



గాడిదబోరులో టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: రైతులు ఖరీఫ్ పంటల సాగుపై పూర్తి అవగాహన పెంచుకోవాలని మార్టేరు శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గాడిదబోరులో గురువారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం మార్టేరు, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు ఖరీఫ్ పంటలపై మార్టేరు శాత్రవేత్తలు అవగాహన కల్పించారు. రైతులకు వరిలో విత్తనాల రకాలు, వరి విత్తనోత్పత్తికి, వరిలో యాజమాన్య పద్ధతులను డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. విత్తనాలు తయారు చేసుకునే విధానాలపై అవగాహన కల్పించారు. రైతులకు ఎకరానికి సరిపడా విత్తనాలు, విత్తన శుద్ధి చేయడానికి కావాల్సిన పౌడర్, జీవన ఎరువులు, మొదలైనవి ఉచితంగా ఇస్తామని చెప్పారు. ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ కృష్ణాజీ మాట్లాడుతూ ప్రత్తి పంటలో యాజమాన్య పద్ధతులను చీడపీడ నివారణ గురించి వివరించారు. అనంతరం 50 మంది రైతులకు టార్పాలిన్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రతినిధి సీహెచ్ వరహాలు, వీఏఏ రాజు, రూపాస్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా డ్రైవర్‌కు వందనం



ఆటో డ్రైవర్ సరస్వతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సరోజా రెడ్డి

జంగారెడ్డిగూడెం: మహిళలు ఇంటికే పరిమితం అనే స్థాయి నుంచి మగవారితో సమానంగా రాణిస్తున్నారని స్థానిక ప్రతిభ స్కూల్ ప్రిన్సిపాల్ కాసర సరోజారెడ్డి అన్నారు. ప్రతిభ స్కూల్‌లో ఆటో డ్రైవర్ సరస్వతిని ఆమె అభినందించారు. స్థానిక డాంగే నగర్‌కు చెందిన సరస్వతి అనే మహిళ భర్తకు అండగా ఉండాలన్న ఉద్దేశంతో తాను కూడా ఒక ఆటో డ్రైవర్‌గా స్ఫూర్తినిస్తోందన్నారు. ఆమెను అభినందించి చీరతో సత్కరించారు. తన ఇద్దరు పిల్లల్ని గొప్పగా తీర్చిదిద్దుకోవాలన్న తాపత్రయంతో తాను కూడా కష్టపడుతున్నానని చెప్పడం అభినందనీయమని సరోజారెడ్డి అన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సింధుషారెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచాలి

చింతలపూడి: పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుకూలంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచాలని, రూ.3 లక్షల వరకు వడ్డీ లేని పంట రుణాలు ఇవ్వాలని, రూ.5 లక్షల వరకు పావలా వడ్డీతో రుణాలు ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రుణాలు ఇవ్వాలని, నీటిపారుదల ప్రాజెక్టు కింద ఉన్న ప్రధాన కాలువలు చిన్న పెద్ద కాలువలలు మరమ్మతులు చేయాలని పేర్కొన్నారు. ఖరీఫ్ సాగుకు విత్తనాలు 90 శాతం సబ్సిడీతో, వ్యవసాయ ట్రాక్టర్లకు 50 శాతం డిస్కౌంట్‌తో డీజిల్ సప్లయ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరు సోమశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎస్‌కే కాలేశా, సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి బాబు, రైతు సంఘం నాయకులు ఎస్‌కే జాని, తక్కిలపాటి ప్రసాద్, తాడిగడప మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు ఇవ్వాలి



దెందులూరు డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శినికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

దెందులూరు: దోసపాడు గ్రామంలో చనిపోయిన పేదలకు మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దోసపాడు పేదలకు జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్‌ను వెంటనే అమలు చేయాలని అసైన్‌మెంట్, సీలింగ్ భూములను పేదలకు పంచాలని, పట్టాలు, పాసుపుస్తకాలు ఇవ్వాలని ఎంతో కాలంగా ఆందోళనలు, పోరాటాలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఎట్టకేలకు జిల్లా జాయింట్ కలెక్టర్, కోర్టు అసలైన అసైన్డ్‌దారులకు పట్టాలు, పాసుపుస్తకాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారని తాత్సారం చేయకుండా మండల రెవెన్యూ అధికారులు పట్టాలు, పాసుపుస్తకాలు ఇవ్వాలని, మరణించిన వారికి మరణ ధ్రువీకరణపత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు దెందులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శినికి వినతి పత్రం అందజేశారు.

రూ.367కు చేరిన వర్జీనియా ధర



కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు కొనుగోలు చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు ధరలకు ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. గురువారం స్థానిక వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో కేజీ పొగాకు ధర రూ.367 చేరి రికార్డు సృష్టించింది. వేలం కేంద్రానికి 966 బేళ్లు రైతులు తీసుకురాగా అందులో 884 బేళ్లను కంపెనీలు పోటీపడి కొనుగోలు చేశాయి. అత్యల్ప ధర రూ.235కు చేరింది. 27వ తేదీ ఒక్కరోజు సరాసరి రూ.365కు చేరుకోగా ఇప్పటివరకు సరాసరి ధర రూ.320గా ఉంది. రూ.192,67,44,103తో సుమారు ఆరున్నర మిలియన్ల కేజీల పొగాకును కొనుగోలు చేశారు.

అండర్‌పాస్‌లోకి నీరు చేరడంతో ఇబ్బందులు



దెందులూరు- అలుగులగూడెం అండర్‌పాస్‌లో మళ్లీ నీరు చేరిన దృశ్యం

దెందులూరు: దెందులూరు– అలుగులగూడెం రైల్వే క్రాసింగ్ గేటు వద్ద నిర్మించిన అండర్ పాసులోకి మళ్లీ వర్షపు నీరు చేరింది. ఈ అండర్‌పాసు మీదుగా దెందులూరు, పెదవేగి, ఏలూరు మండలాల ప్రజల ప్రయాణికులు, విద్యార్థులు అనునిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. అండర్‌పాస్ వంతెన పైన ఏదైనా రక్షణ మార్గం ఏర్పాటు చేస్తే వర్షపు నీరు అండర్‌పాసులోకి రాకుండా ఉంటుందని అలా రక్షణ చర్యలు చేయకపోవడం వల్ల కొద్దిపాటి వర్షం వచ్చినా అండర్‌పాసులోకి నీరు చేరి తీవ్ర అసౌకర్యం కలుగుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వర్షం వచ్చినప్పుడు నీరు తోడించడమే కాకుండా మూడు మండలాల ప్రజలు ప్రయాణాలను దృష్టిలో పెట్టుకుని శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

రహదారులు అధ్వానం



భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు ఛిద్రమయిన రహదారి

భీమడోలు: అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయి. గోతుల మయంగా మారిన రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనితో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు, రాజుల వీధిలోని రోడ్లు, జంక్షన్‌లోని కూడలి ప్రాంతం అడుగడుగునా గోతులతో నిండాయి. వేసవిలో రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినా సంబంధిత అధికారులు మాత్రం గోతులను పూడ్చిన పాపాన పోలేదు. ద్వారకాతిరుమల వేంకటేశ్వరుని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులకు ఇదే ప్రధాన మార్గం కావడంతో ఈ గోతులతో నిండిన రోడ్లపై ప్రయాణించాలంటేనే హడలెత్తిపోతున్నారు. ఇకనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వలంటీరు సేవలకు మంగళం!

- ఇప్పటికే పేపర్ బిల్లు భత్యం రూ.200 నిలిపివేత
- పింఛన్ల పంపిణీ బాధ్యతలకూ దూరం
- జూలై 1 నుంచి సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- రోడ్డున పడనున్న 1,466 మంది వలంటీర్లు



బువ్వనపల్లి సచివాలయం



బువ్వనపల్లిలో పింఛన్ అందిస్తున్న వలంటీరు (ఫైల్)

నిడమర్రు: తాము అధికారంలోకి వస్తే వలంటీరు వ్యవస్థను కొనసాగించడంతో పాటు వారికి ఇచ్చే గౌరవ వేతనం రూ.5 వేలు నుంచి రూ.10 వేలకు పెంచుతామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ పార్టీ మేనిఫెస్టోలోనూ దీనిని పొందుపరిచారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు వలంటీర్ల ఊసెత్తకపోగా వారిని విధులకు దూరంగా ఉంచారు. తాజాగా గత ప్రభుత్వం ఇస్తున్న పేపర్ బిల్లు భత్యం నిలిపివేయడంతోపాటు పెన్షన్ల పంపిణీ బాధ్యతను కూడా సచివాలయ ఉద్యోగులకే అప్పగించడంతో వలంటీరు వ్యవస్థ కొనసాగింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఉంగుటూరు నియోజకవర్గంలో వలంటీర్లుగా సేవలందిస్తున్న 1466 మంది వారి భవిష్యత్ అగమ్యగోచరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శక సేవల కోసం సచివాలయాలు

ప్రజలకు పారదర్శకంగా మెరుగైన సేవలు అందించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. దీనికి అనుబంధంగా వలంటీరు వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఈ వ్యవస్థ ద్వారా ప్రజల ఇళ్ల వద్దే అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకుంది. ఉంగుటూరు నియోజకవర్గంలో 50 ఇళ్లకు ఒక వలంటీరును అధికారులు నియమించారు. వీరు గత ఐదేళ్లగా ప్రభుత్వ పథకాలు, సేవలను వారికి కేటాయించిన ఇంటింటికి వెళ్లి అందించారు. ప్రతీ నెల 1వ తేదీ ఉదయాన్నే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేసి వారి మన్ననలు అందుకున్నారు. ఈ వ్యవస్థను ముందు నుంచి వ్యతిరేకిస్తున్న టీడీపీ ఎన్నికల ముందు మాత్రం వలంటీరు వ్యవస్థను కొనసాగించడమే కాకుండా వారికి ఇచ్చే గౌరవ వేతనం రెట్టింపు చేస్తానని ప్రతీ సభలో వలంటీర్లకు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎటువంటి బాధ్యతలు అప్పగించకుండా వారిని ఇళ్లకు పరిమితం చేయడంపై వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిడమర్రులో 6430 మందికి ఇంటి వద్దే పంపిణీ

అవ్వా తాతలకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు, కిడ్నీ బాధితులకు సామాజిక భద్రత కల్పించేందుకు అందించే పెన్షన్ల పంపిణీ ఒకటో తేదీ ఉదయం 8 గంటల లోపు 90 శాతం పూర్తయ్యేది. నిడమర్రు మండలంలో 16 గ్రామాల్లో 6430 మంది వివిధ రకాల పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 3,524 మంది వృద్ధాప్య, 1330 మంది వితంతు, 768 మంది దివ్యాంగ, 367 మంది మత్స్యకార, 441 మంది కల్లుగీత, కిడ్నీ వ్యాధిగ్రస్తుల పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే వరకూ మండలంలోని 243 మంది గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ పూర్తి చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఆయా గ్రామాల్లోని సచివాలయ సిబ్బందితో పింఛన్ పంపిణీ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తుంది.